# బదిలీ

ఆదివారం ఆలస్యంగా నిద్రలేచి తల్లి యిచ్చిన కాఫీ త్రాగుతూ పేపర్ చదువుకుంటున్న రాఘవరావుకి సుందరం రాక అపశకునంలా తోచింది. సుందరం రావడాన్ని గుర్తించినట్లుగా ఒక చిరునవ్వు నవ్వి మళ్ళీ పేపర్లో తల దూర్చాడు రాఘవరావు. సుందరం చాలా చొరవగా వంట ఇంట్లోకి వెళ్ళిపోయి, రాఘవ తల్లిని పలకరించి ఆవిడ యిచ్చిన కాఫీ కప్పు పుచ్చుకుని వరండాలోకి వెళ్ళి, రాఘవ తండ్రిని కూడా పలకరించి, వచ్చి అతని ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు.

"ఆదివారం కదా - రజనీ పిల్లలూ వచ్చారేమో అనుకున్నాను. అయినా వాళ్ళు ముగ్గురు రావడం కంటే నువ్వు ఒక్కడివే వెళ్ళడం సులువేమో! వెళ్ళి వుంటావను కున్నాను." అన్నాడు కొంచెం సేపు ఆగి.

అతని వ్యాఖ్యానాలకీ, ప్రశ్నలకీ ప్రతిస్పందించడం రాఘవరావుకి యిష్టం లేకపోయింది. అతను మళ్ళీ ఒక నవ్వు నవ్వి వూరుకున్నాడు.

"పిల్లల్ని తీసుకు వెళ్ళక ముందు నెలకి ఒకసారో రెండుసార్లో వచ్చేది. ఇప్పుడు వీడు వెళ్ళడమే." అన్నాడు రాఘవ తండ్రి, లోపలికి వచ్చి కూర్చుని -

"ఈ మధ్యన - అంటే క్రిందటి సోమవారం అనుకుంటా - మా తమ్ముడు హైదరాబాద్ వెళ్ళాడు. ఆబిడ్స్‌లో ఒక మందుల షాపు దగ్గర రజనీ కనిపించిందట. మా వాడిని పలకరించి,

ఎవరో సుబ్బారావట - అతన్ని పరిచయం చేసిందట - అతని స్కూటర్ మీదే ఎక్కి వెళ్ళిపోయిందట - అబ్బో - అక్కడికి వెళ్ళిన తరువాత చీరెలు కట్టడం లేదులా వుంది - చుడీదార్ వేసిందట -" అన్నాడు సుందరం మళ్ళీ -

"చుడీదార్ కాకపోతే షార్ట్స్ వేసుకుంటుంది - నీకెందుకు మధ్యలో -" అన్నాడు రాఘవరావు చిరాకుపడుతూ -

సుందరం కొంచెం బెదురుతూ "అహ! అలా అని కాదు - మావాడు రజనీని గుర్తుపట్టలేదని చెప్పడానికి అలా అన్నాను - ఆవిడ ఏమి వేసుకుంటే మాకేం? ఎవరి స్కూటర్ మీద వెడితే నాకేం!" అన్నాడు కచ్చగా - ఆ సంభాషణ తండ్రి పొడిగించకుండా జాగ్రత్త పడ్డట్లు రాఘవరావు అక్కడి నించీ లేచి, "నేను హెయిర్ కట్‌కి వెడుతున్నాను." అని వెళ్ళిపోయేడు. ఆ పైన సుందరం తన తండ్రికీ తల్లికీ ఎన్ని చిలవలు పలువలు చెబుతాడో అతనికి తెలుసు.

ఈ మధ్యన రజనీ చాలా మారి పోయినట్టు రాఘవరావుకి కూడా అనిపిస్తోంది. సుబ్బారావుతో స్నేహం గురించీ, వేషభాషల్లో మార్పు గురించీ కూడా! ఈ ఆదివారం వెడితే బావుండేది. బద్ధకించేడు. పైగా తండ్రి ఒకటే పోరు - సైన్సు లెక్చరర్ వైయుండీ కాలాన్ని వ్యర్థం చేసుకో కుండా ట్యూషన్లు చెప్పుకుని బాగా సంపాదించుకోమనీ - పెళ్ళాన్ని ఉద్యోగం మాన్పించి తెచ్చుకోమనీ - రజనీ ప్రవర్తన మారిపోతుందనీ, ఆమెని ఇప్పుడు కంట్రోల్ చేసుకోకపోతే ఇంకెప్పటికీ చేసుకోలేవనీ - పిల్లలు కూడా నువ్వు చెప్పినట్లు ఇంక మీదట వినరనీ, ఆయన పని గట్టుకుని ప్రతీరోజూ చెబుతున్నాడు. సాయంత్రం ఇంటి కొచ్చే సరికి పిల్లలూ రజనీ లేకపోతే తనకేం తోచడం లేదు. అందుకని తండ్రి చెప్పినట్లు ఒక ట్యుటోరియల్ కాలేజిలో రెండు గంటలు పాఠం చెప్పడానికి వొప్పుకున్నాడు. రజనీ ట్రాన్స్‌ఫర్ వలన తనకి ఏ ఇబ్బందీ లేదు. తల్లి వండి పెడుతోంది - డబ్బుంది - పిల్లలతో, ఆమెకి వచ్చే జీతంలో ఎలా సర్దుకుంటోందోనని మొదట్లో అనుకునేవాడు. కొంత డబ్బుకూడా పంపేవాడు. రెండు నెలలుగా రజని ప్రవర్తన గురించి వింటూన్న కొద్దీ అతనికి డబ్బు పంప బుద్ధి కావడం లేదు. తండ్రి అతన్ని డబ్బు సంపాదన వైపు మళ్ళించడంతో - ఇప్పుడతనికి చేతినిండా డబ్బున్నట్లు అనిపిస్తోంది - పిల్లలపేర బ్యాంక్‌లో రికరింగ్ డిపాజిట్ తెరిచాడేగానీ రజనీకి పంపబుద్ధి కాలేదు. - "నువ్వీ ట్యూషన్ వ్యామోహంలో పడకుండా పిల్లలకి బాగా పాఠాలు చెబుతావని గర్వపడేదాన్ని - ఎందుకిలా కష్టపడుతున్నావు రాఘవా?"అంది రజని, క్రిందటిసారి తను హైదరాబాద్ వెళ్ళినప్పుడు.

"నువ్వు లేవు - పిల్లలూ లేరు - సాయంత్రాలంతా నేనేం చెయ్యాలి -" అన్నాడు.

"నువ్వు చిన్నప్పుడు ఎంతో బాగా పాటలు పాడేవాడివి - మంచి పుస్తకాలు చదివేవాడివి - పోనీ నీకేం తోచకపోతే కొంత మంది బీదపిల్లలకి ఊర్కే పాఠలు చెప్పవచ్చుగా - డబ్బు తీసుకొని ఎందుకు?" అంది మళ్ళీ -

" నేను నీ అంత విశాల హృదయుణ్ణి కాదు రజనీ - నాకు డబ్బు అవసరం - నేను పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం నేర్చుకుంటున్నాను." అన్నాడు రాఘవరావు - కొంచెం రజనీని హర్ట్ చేసి సంతృప్తిపడాలని - "నువ్వు పిల్లల కోసం డబ్బు పంపడం లేదు - నేనే కష్టపడి వాళ్ళని చూస్తున్నాను -" అని రజనీ అంటే ఆమెతో వాదానికి దిగాలని సిద్ధపడ్డాడు. కానీ రజని ఆమాట అనలేదు - అసంతృప్తితో అప్రసక్తి వదిలి పెట్టాడు.

హెయిగేకట్ నుంచీ రాగానే తండ్రి అందుకున్నాడు - "శృతి మించి రాగాన పడక ముందే రజనీని తీసుకొచ్చేయ్ - ఇప్పుడు నువ్వు బాగానే సంపాదించు కుంటున్నావు - రజనీ జీతం అంతా నీకు ట్యుటోరియల్స్ వాళ్ళిస్తున్నారు - కాపురం చెడగొట్టుకోకు - బ్రతిమాలో బెదిరించో వెళ్ళి ఆ పిల్లని తీసుకురా -" అన్నాడు.

"అవున్రా, రాఘవా - ఊళ్ళో వాళ్ళ మాటలు వినలేక చస్తున్నాను - మన ఇంటావంటా ఇలాంటివి లేవు -" అంది తల్లి -

'నాలుగు డబ్బులు సంపాదిస్తున్నానని కళ్ళు నెత్తికెక్కాయి ఆపిల్లకి - అసలు మొదట్లోనే నువ్వు రజనీని హైదరాబాద్ వెళ్ళనిచ్చి వుండకూడదు - చాలా తప్పు చేశావు - నీకు ముందు నుంచే చెబుతున్నాను - నామాట విన్నావు కాదు - రెట్టింపు డబ్బు సంపాదించగల శక్తి నీ దగ్గర పెట్టుకుని ఆ పిల్ల జీతం మీద ఆధారపడ్డావు - ఆడవాళ్ళని దార్లో పెట్టడానికి అనేక మార్గాలున్నాయి. అప్పటి నుంచీ ట్యూషన్లు పెట్టుకొనుంటే ఈ పాటికి ఇల్లు కట్టుకుని వుండేవాడివి - నీ భార్యకి నగా నట్రా కొనే వాడివి - నగలకీ చీరెలకీ అలవాటుపడ్డ ఏ ఆడదీ ఇలా మొగుణ్ణి విడిచి పోదు - కీలకం అంతా డబ్బులోనే వుంది - మంచిగా నయంగా చెప్పు - నీకేం లోటు రానివ్వనని చెప్పి తీసుకురా -" తండ్రి అన్నాడు.

రాఘవరావుకి ఊపిరాడనట్లైంది - తామిద్దరూ పెళ్ళి చేసుకునేముందే రజని - తను ఉద్యోగం మానేసే ప్రసక్తే లేదని చెప్పింది - కనీసం ఆమెని హైదరాబాద్ వెళ్ళనివ్వకుండా కూడా తను అడ్డుపడ లేకపోయాడు. ఏ చురుకుదనం, ఏ తెలివీ, ఏ సామర్థ్యం చూసి, ఏ స్నేహం, ఏ మంచి తనం చూసి ఆమెని తను యిష్టపడ్డాడో, ఇప్పుడా గుణాలే రజనికీ తనకీ మధ్య తెరలు దించుతున్నాయి.

రెండు సంవత్సరాల క్రితం రజనీ పని చేసే ఆఫీసుకి క్రొత్త మేనేజరు వచ్చాడు. అతను కాకా ప్రియుడని, రాగానే స్టాఫంతా కనిపెట్టి అతని అహాన్ని వీలున్నంతగా సంతృప్తి పరచడం మొదలు పెట్టారు. రజనీ పని చేసే ఆఫీసులో రజనీ కాక ఇంకా ఇద్దరు స్త్రీలున్నారు. అందులో చారుమతి సీనియర్. అయినా ఆవిడకింకా ప్రమోషన్ రాలేదు - న్యాయంగా అయితే ఈ పాటికిచారుమతి మేనేజరు కావల్సి వుంది - కానీ ఆవిడ పెట్టినన్ని మెడికల్ లీవులు, ఎర్న్డ్ లీవులు ఇంకెవరూ పెట్టరు - జీతం నష్టం మీద సెలవులూ, లేట్ పర్మిషన్లూ లెక్కలేదు - ఎంత

కష్టపడైనా ఈ వూళ్ళో వుండడం ఆవిడలక్ష్యం - భర్తని విడిచి వెళ్ళడం యిష్టం లేదు - ఈ మేనేజర్ వచ్చాక అతని భార్యకి ఆవకాయ పెట్టేపని తప్పించింది చారుమతి - గోంగూర అయితే చారుమతి ఇంట్లో నుంచీ వస్తేనే అందరికీ యిష్టం మేనేజర్‌గారింట్లో - ఇంక వరలక్ష్మి - వరలక్ష్మి భర్త తరచూ ఆఫీసుకి వచ్చి మేనేజర్‌ని కలుస్తూ వుంటాడు. ఆయనకేదో వ్యాపారం వుంది. ఈ వ్యాపార లావాదేవీల వల్లనయితేనేం, మేనేజర్‌ని పనిగట్టుకుని పొగడడం వల్లనయితేనేం వరలక్ష్మి కూడా మేనేజర్ దయకి పాత్రురాలే - శివరావు మేనేజర్ గారికి షాపింగ్ చేసి పెడతాడు - ప్రభాకర్ కబుర్లు చేరవేస్తాడు - ఆఫీసు మొత్తంమీద సాంబిరెడ్డి, రజనీ మాత్రం మేనేజర్‌గారి దయకి పాత్రులు కాని లిస్టులో చేరిపోయారు - అందునా మేనేజర్ వచ్చిన ఆరునెలలకే రజనీకి అతనికి పెద్ద తగాదా అయింది - తప్పు తనలో పెట్టుకుని రజనీకి మెమో ఇస్తే, దానికి రజనీ చాలా ఘాటయిన జవాబు యిచ్చింది - అప్పటి నించీ ప్రచ్ఛన్నయుద్ధం సాగుతూనే వుంది - రాఘవరావు రజనీకి చాలాసార్లు చెప్పాడు - "కుర్చీలో కూర్చున్న ప్రతివాడూ, తన స్టాఫ్‌కన్న తనే తెలివైన వాడనుకుంటాడు. అందరూ తన తెలివిని కొనియాడాలను కుంటాడు - తను చెప్పినట్టు వినాలను కుంటాడు - హీరార్కీలు ప్రతిచోటా వుంటాయి - అందుకని పదికాలాలపాటు ఇక్కడ ఉద్యోగం చేసుకోవాలనుకుంటే అతడితో తగవు పడకు -"అని -

"ఆఫీసులో రాజకీయాలను గురించి మాట్లాడకు - నీ చురుకుతనం - తెలివి తేటలు ప్రదర్శించకు - తలవంచుకుని వెళ్ళి నీ పని చేసి వచ్చెయ్ - అనవసరమైన వాటిలో కల్పించుకోకు," అని చాలా చెప్పాడు. రజని మొండిఘటం అని అతనికి తెలుసు. ఆ మొండితనాన్నే అదివరకు అతను అభిమానించాడు. కానీ ఇప్పుడది తలబిరుసుతనంగా కన్పిస్తోంది - ఈ పరిస్థితి ఇలా వుండగా మేనేజర్ చుట్టం ఒకడు (హైదరాబాద్ ఆఫీసులో వుండే వాడు) ఈ వూరమ్మాయిని పెళ్ళిచేసు కున్నాడు. ఆ అమ్మాయి తన తండ్రికి ఒక్కగానొక్క కూతురు - పైగా ఈ వూళ్ళో బ్యూటీక్లినిక్ నడుపుతోంది - క్లినిక్ మీద బాగా ఆదాయం వస్తుంది - అతనికిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయితే ఇంటద్దె, తిండి, భార్య సంపాదన అన్ని కలిసి వస్తాయి. ఆ పని తను చేసిపెడతానని స్నేహితుడికి మాటిచ్చాడు మేనేజరు - ఇక్కడినించీ ఎవర్ని కదిలించాలా అని ఆలోచిస్తే అతనికి రజని కనిపించింది - నిజానికి సాంబిరెడ్డిని పంపవచ్చు. అతనికింకా పెళ్ళికాలేదు - హైదరాబాద్‌లో వుంటే బావుండునని ఆలోచిస్తున్నాడు. హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ సాంబిరెడ్డికి ఆనందం, రజనీకి విచారం కలిగిస్తాయి గనుక రజనీనే కదిలిస్తే పోతుందనుకున్నాడతను - రజనీకి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చింది - ఆరోజు బ్రతిమిలాడి, కోప్పడి కూడా చెప్పాడు రాఘవరావు - 'ఒకనెల మెడికల్ లీవ్ పడెయ్ - నేను హైదరాబాద్ వెళ్ళి నీ బదిలీ ఆపిస్తాను - సాంబిరెడ్డికి అయ్యేలా చూస్తాను - లంచాలతో కాని పని ఈ ప్రపంచంలో ఏదీ లేదు -' అని -

"మొన్న పాపకి జబ్బు చేస్తే నేనే మెడికల్ లీవ్ పెట్టాను. నిరుడు మీ చెల్లెలు పెళ్ళికి మెడికల్ లీవ్ పెట్టాను - ఇలా పోయిన పాడుగునా మెడికల్ లీవులు పెట్టుకుంటూంటే నేనూ చారుమతిలా ఈ సీట్లో పడివుండాల్సిందే - నాకు జన్మలో ప్రమోషన్ రాదు - పైగా ఈ మేనేజర్ ఏదో ఒక విధంగా నన్ను ఏడిపిస్తూనే వుంటాడు - మొన్న నీ స్నేహితుడు సత్యనారాయణకి ట్రాన్స్‌ఫర్ అయితే ఏం చెప్పావునువ్వు? తిరిగి చూడకుండా వెళ్ళి పొమ్మన్నావు- గుర్తుందా. మెడికల్ లీవులు అంతగా వాడుకోడం మంచిది కాదని నువ్వేకదా చెప్పావు?" అని నిలదీసింది రజని -

"వాడికీ నీకూ పోలికేమిటీ? వాడు మగవాడు - వాడికి ప్రమోషన్ అవసరం - నీకు రాకపోయినా బాధలేదు - మనిద్దరి జీతం మనకి చాలదా?" అన్నాడు రాఘవరావు. అందుకు రజని వొప్పుకోలేదు - ప్రమోషన్లు లేకుండా కేవలం 'వేడినీళ్ళకి చన్నీళ్ళు' మాదిరిగా ఉద్యోగం చెయ్యడం తనకిష్టం లేదంది. 'మనిద్దరం ఎనిమి దేళ్ళుగా ఇక్కడున్నాం కలిసి - కొన్నాళ్ళు విడిగా వుందాం - పోయేదేం వుంది? ఎంతమంది భర్తలకి ట్రాన్స్‌ఫర్ అయితే వాళ్ళ భార్యలు పిల్లల్ని పెట్టుకుని వంటరిగా ఉండడంలేదు? చదువులకోసం! - ఎవరికి ట్రాన్స్‌ఫర్ అయినా ఫలితం ఒకటేగదా - సత్యనారాయణ ఒకచోట సునంద ఇంకొకచోటా వుండడంలా?" అని తర్కించింది -

ఉద్యోగాల మీద ఆధారపడ్డ కుటుంబాలు చాలా ఇలా విడివిడిగా వుండడం తెలిసిన విషయమే - అయితే పురుషుడికి ట్రాన్స్‌ఫర్ అయితే అతను వెళ్ళినట్లుగా స్త్రీకి ట్రాన్స్‌ఫర్ అయితే వెళ్ళడం కష్టం అని అనుకుంటారు - "నీది ట్రాన్స్‌ఫర్లు లేని ఉద్యోగం గనుక నీకాకష్టం తెలీదు - అదే నీకూ ట్రాన్స్‌ఫర్ అయిందనుకో, నన్నూ పిల్లల్నీ ఇక్కడుంచి నువ్వు వెళ్ళేవాడివి కావా?" అని నిలదీసింది-

రెండుకాపురాలు, రెండు ఇంటి అద్దెలు అంటూ చాలా చెప్పాడు రాఘవరావు - అవన్నీ సత్యనారాయణకి మాత్రం లేవా? అతన్నెందుకు వెళ్ళమన్నావంది. ససేమిరా మెడికల్ లీవు పెట్టను - వెళ్ళి చేరిపోతానంది -

"నీ పిల్లల్నెవరు చూస్తారు?" అని ఆఖరి అస్త్రం ప్రయోగించాడు రాఘవరావు.

"వాళ్ళు నీ పిల్లలు కూడా అని మర్చిపోకు - ఇంకా రెండు మూడు నెలల్లో వాళ్ళకి పరీక్షలైపోతాయి - వేసవిసెలవుల్లో తీసుకువెళ్ళి అక్కడ చేర్పిస్తాను - అత్తయ్య చూడనంటే చెప్పు - మా అమ్మని తీసుకొస్తా" అంది -

"పిల్లల్ని చూడ్డం నావల్ల కాదు -" అనలేక పోయింది రాఘవ తల్లి - ఆవిడకి మొదటి నించీ వాళ్ళంటే ప్రాణం - వాళ్ళకీ నాయనమ్మంటే యిష్టం - అంతేకాదు రాఘవరావు చెల్లెలు పెళ్ళినడుంకట్టుకుని జరిపించింది రజనీయే - బ్యాంక్‌లో నగలు తాకట్టు పెట్టి కొంత డబ్బు కూడా యిచ్చింది

"ఏదో పంతానికి పోతోంది పిచ్చి పిల్ల - ఒకనెల వంటరిగా వుంటే తెలిసొస్తుంది - తనే ప్రయత్నించి మళ్ళీ ఇక్కడికి వచ్చేస్తుంది - ఈ భాగ్యానికి దానితో తగాదా ఎందుకురా రాఘవా - వెళ్ళనియ్ - పిల్లలు నాకు బరువా ఏం?" అందావిడ.

"ఇలాగే వెనకేసుకొస్తావు - అసలు వెళ్ళడం ఎందుకంటా - ఆ డబ్బు ఇక్కడ సంపాదించుకోకూడదా? అంత జీతం వచ్చే ఉద్యోగం ఇక్కడ దొరకదా?" అన్నాడు మామగారు.

"పోనీ, రాఘవే అక్కడికి రావచ్చు గదా - ఇంత జీతం వచ్చే ఉద్యోగం అతనికి మాత్రం అక్కడ దొరకదా!" అంది రజని చిరాకుపడిపోతూ -

"బాగానే వుంది సంబరం - వాడిది పర్మనెంటు ఉద్యోగం - పదేళ్ళ సర్వీసు - ఇదంతా పోగొట్టుకోవాలా? రిటైర్‌మెంటు బెనిఫిట్స్ పోవా!" అన్నాడు మామగారు కోపం తెచ్చుకుని -

"నాదీ అంతేనండీ - ఎనిమిదేళ్ళ సర్వీస్. డ్యూ ఫర్ ప్రమోషన్ - నాకు మాత్రం రిటైర్‌మెంటు బెనిఫిట్స్ పోవా?"

"నీ పెద్దతనంలో నిన్ను మొగుడూ పిల్లలూ చూసుకోరా? నీకేం తక్కువమ్మా!" అంది అత్తగారు.

'ఆయన్ని మాత్రం పిల్లలు చూసుకోరా?' అంది రజని -

"మొండి వాడు రాజు కంటే బలవంతుడని సామెత - కానియ్యమ్మ - నీ యిష్టం వచ్చినట్లే కానీ - తప్పేదేముందీ - "అన్నాడు మామగారు. అన్నాడే గానీ ఆయనకి పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేకపోయిన రాఘవరావు చేతగాని తనానికి కోపం వచ్చింది - ఆ రోజు నుంచీ కొడుకుని ఇంకా డబ్బు సంపాదించుకుని, డబ్బు పెత్తనం మొత్తం చేతిలోకి తీసుకుని పెళ్ళాన్ని అదుపులో వుంచుకోమని పోరుతూనే వున్నాడు. ఉద్యోగంలో చేరిన రజనీ పదిహేను రోజుల తరువాత పిల్లల్ని చూడడానికి వస్తూ వాళ్ళకి బొమ్మలూ పుస్తకాలూ తెచ్చింది - అత్తగారికి కూడా ఏవో తెచ్చింది - ఒక్కతే వుంటున్నందుకు దిగులుపడి వుంటుందనీ, చిక్కిపోయి వుంటుందనీ పిల్లలమీద బెంగ పెట్టుకుని వుంటుందనీ - ఇంక తప్పకుండా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం చేస్తుందనీ ఆశపడ్డారు అందరూ - అదేం లేకపోగా రెట్టింపు ఉత్సాహంతో వచ్చింది. అక్కడ ఆఫీసులో పనిచెయ్యడం తనకి చాలా నచ్చిందట - పిల్లల సీట్లకి కూడా ప్రయత్నిస్తోందట - ఆపకుండా కబుర్లు చెబుతూంటే కనపడకుండా ఆశాభంగం చెందాడు రాఘవరావు. వేసవి సెలవులకి అందర్నీ హైదరాబాద్ ప్రయాణం చేసింది. అత్తగారు మావగారు మాత్రం ఏమీ యిష్టం చూపలేదు - రాఘవపిల్లల్ని తీసుకుని వెళ్ళాడు - సెలవులు రెండు నెలలూ అతనికి త్వరగా గడిచి పోయాయి - పిల్లల్తో ఊరుచూడ్డం - రజనికి వంటలో సాయం చెయ్యడం - పిల్లల సీట్లకోసం ప్రయత్నం - వాళ్ళని ఎంట్రెన్స్‌కి తయారుచేయడం - పరీక్ష వ్రాయించడం - ఈ హడావుడిలో, ఆనందంలో అతను రజనీ వేషభాషలు మారాయనీ,

సుబ్బారావు అనే వ్యక్తీ, అతని భార్యా ఆమెకి సన్నిహితులయ్యారనీ గమనించలేదు. ఆ మాటకొస్తే రాఘవరావూ సుబ్బారావు కలిసి చాలాసార్లు బీరు సేవించారు - సినిమా చూశారు - ఛెస్ ఆడారు - పాటలు పాడారు. 'రుదాలి' సినిమాలో భూపేన్ హజారికా పాట సుబ్బారావు పాడినప్పుడు పరవశుడై అతన్ని కౌగిలించుకున్నది రాఘవే - అతను తమ ఇంట్లోనే తమ పొయ్యి మీదే గుత్తి వంకాయకూర వండినప్పుడు, ఆమ్లెట్లు వేసినప్పుడు అతని పాక శాస్త్ర ప్రావీణ్యాన్ని కొనియాడిందీ రాఘవే - అప్పుడెప్పుడూ అతనికి సుబ్బారావు ప్రవర్తనలో ఏ మాత్రం అసభ్యత కనిపించలేదు - సుమతినీ సుబ్బారావునీ ఎంతో మెచ్చుకున్నాడు కూడాను -

కానీ ఇప్పటి పరిస్థితి వేరు - ఇప్పుడు సుమతీ సుబ్బారావూ రజనీ కలిసి పెద్ద ఇల్లు తీసుకున్నారు - కలిసి వండుకుంటున్నారు - ఇవ్వన్నీ,సామాన్లు కలిసి వస్తాయని చేశామంటున్నారు -

ఈవూరు నుంచీ హైదరాబాద్ వెళ్ళొచ్చే వాళ్ళు చాలామంది వున్నారు - వాళ్ళల్లో కొంతమంది పనిగట్టుకుని రజని వాళ్ళ ఆఫీసుకు వెళ్ళి రావడం, ఆమె ఇంటికి వెళ్ళి రావడం చేస్తున్నారు - యిష్టం వచ్చినట్లు స్కాండల్స్ ప్రచారం చేస్తున్నారు-

రాఘవరావు మనస్సంతా చికాకుగా తయారైంది- రజనీ వెళ్ళి సంవత్సరం కావచ్చింది - పిల్లలూ తల్లీ కూడా చాలా ఆనందంగా కన్పించడం కూడా అతనికి నచ్చడం లేదు - ఇప్పుడతను ప్రొద్దునపూట ఎం.సెట్ కోచింగ్ పెట్టుకున్నాడు. ఈ వేసవి సెలవులకి వెళ్ళినప్పుడు రజనీని వొప్పించి తీసుకురావాలని - వొప్పుకుని రాకపోతే బెదిరించాలని కూడా నిర్ణయించుకున్నాడు - ఆమె చేత ఏ విధంగానైనా రెండు మూడు నెలలు సెలవు పెట్టించాలని కూడా నిర్ణయించుకున్నాడు.

"ఏమిటో ఈ పెద్దతనంలో నాకు ఇంటి బాధ్యతలు పడ్డాయి-" అంటూ తల్లి సణుగుడు -

"నువ్వొట్టి దద్దమ్మవి" అని తండ్రి ఆక్షేపణ -

"ఆ సుబ్బారావెవరబ్బా! ఇంక మీ ఆవిడ నిన్ను విడిచిపెట్టేసినట్లేనా?" అని సుందరం లాంటి వాళ్ళ వ్యాఖ్యానాలు, ప్రశ్నలు -

రజనీ హుషారు - రజనీ చురుకుదనం - సత్యనారాయణ వెళ్ళి రెండేళ్ళయినా సునంద దిగులుగా లేదు- హాయిగా స్కూల్లో పాఠాలు చెప్పుకుంటోంది - తనూ సునందకి సాయం చేస్తున్నాడు గానీ తననీ సునందనీ ఎవరూ ఏమీ అనడం లేదు - "అవును - పాపం సత్యనారాయణకి ట్రాన్స్‌ఫర్ అయింది ! ఉద్యోగం మీద ఆధారపడ్డ వాడు వెళ్ళక తప్పదు - ఏం చేస్తాడు? వెళ్ళ బట్టే ప్రమోషన్ వచ్చింది - వాళ్ళావిడ పాపం ఎంతో కష్టపడి పిల్లల్ని

చదివించుకుంటోంది - చాలా నెమ్మదస్థురాలు. వంచిన తల ఎత్తదు-" అని ఆవిడకి అంతా శాలువ కప్పి సన్మానించారు కూడా.

"రజనీకి పాపం ట్రాన్స్‌ఫర్ వస్తే వెళ్ళింది - పిల్లల్ని కూడా తీసుకువెళ్ళింది. కష్టపడి చదివించుకుంటోంది పాపం! సుబ్బారావు ఆమెకి చాలా సాయం చేస్తున్నాడు. చాలా మంచి అమ్మాయి- ఎంతో చురుకైనది - ఆమెకి ప్రమోషన్ రావడం ఖాయం!" అని ఎవరూ అనడం లేదు - ఎందుకో అర్థం కావడం లేదు రాఘవరావుకి. నిజంగా రజనీలోనే లోపం వుందనిపిస్తోంది అతనికి - ఏది ఏమైనా ఎం.సెట్ పరీక్షలు కాగానే వెళ్ళి రజనీని సెలవు పెట్టించి తీసుకు రావాలనే సంకల్పంతో హైదరాబాద్ వెళ్ళాడు. పట్టుదల తోనే అతను రజనీకి డబ్బు పంపడం లేదు. రజనీ తనని ఒక్కరోజు కూడా డబ్బు కావాలని అడగలేదు - పిల్లల స్కూల్ ఫీజులు అక్కడ ఎక్కువే - ఎలా తంటాలుపడుతుందో చూడాలి అనుకున్నాడు.

అతను వెళ్ళేసరికి సుమతి, సుబ్బారావు. రజని ఎవరూ ఇంట్లో లేరు - పిల్లలు టీ.వి. చూస్తున్నారు - టీ.వి. కోసం ఫ్రిజ్ కోసం వీళ్ళింటికి మారిందా అనిపించింది - ఒక బెడ్‌రూం ఒక బాత్ రూం ప్రత్యేకంగా రజనివి - హాలు ఇద్దరూ వాడుకుంటారు - వంట ఇంట్లో సామాన్లన్నీ ఎవరివో తెలీదుగానీ పిల్లలు తనకి కాఫీ పెట్టుకునే సామాన్లు చూపించి కాఫీ కలుపుకోమన్నారు - సుమతీ సుబ్బారావు కలిసి పుస్తకాలు చాలానే పోగు చేశారు. రజనీ మీద ఎంత కోపంగా వున్నా ఆ ఇంట్లో ఎందుకో చల్లగా ప్రశాంతంగా వున్నట్లనిపించింది - పిల్లలిద్దరూ ఊపిరాడనీయకుండా కబుర్లు చెప్పారు. నాయనమ్మని తాతగారిని తీసుకు రాలేకపోయారా అని అడిగారు.

"సుబ్బారావు, సుమతీ ఏమైనా అనుకుంటారేమోనని రాలేదు వాళ్ళు - మనం వేరేవుంటే తెచ్చేవాళ్ళే -" అన్నాడు కావాలని -

"సుబ్బారావు అంకుల్ చాలా మంచివాడు - ఏం అనుకోడు -" అంది పాప-కళ్ళు తిప్పుతూ -

రాఘవ ఏమీ అనలేదు -

'నువ్వీ ఇంట్లోకి మారడం నాకేం నచ్చలేదు రజనీ - ఇక్కడ మనకి ప్రయివేసీ ఏముంది? అయినా ఎప్పుడూ ఇక్కడే వుండబోయే దానిలా ఎందుకు మారావు? నీ చేత రెండు నెలలు సెలవు పెట్టించి మన వూరు తీసుకుపోదామని వచ్చానీసారి - నాకిక్కడ వుండబుద్ధి కావడం లేదు -" అన్నాడు రజనితో రాత్రి.

"ఏది మన వూరు?" అంది రజని

"అదేమిటి? మన వూరు - మన వూరే-"

"అది నువ్వు ఉద్యోగం చేసే వూరు - ఇది నేను ఉద్యోగం చేసేవూరు - మనకంటూ ఒక వూరేది రాఘవా? ఏ వూళ్ళోనైనా మనకి పొలమో ఇల్లో వుంటే అది మన వూరౌతుంది -

లేకపోతే మనం ఎక్కడుంటే అదే మన వూరు - ప్రస్తుతం ఇక్కడున్నాం గనుక ఇదే మన వూరు - ఏం - ఈ సారి ఇంత కోపంగా వచ్చావు?" అని భుజం మీద చెయ్యి వేసింది -

"నీ లాజిక్కంతా వినడానికి బాగానే వుంటుంది - కానీ నాకిప్పుడు నచ్చడం లేదు - నేనిప్పుడు బాగా సంపాదిస్తున్నాను - ఏడాది నుంచీ లక్ష రూపాయలు బ్యాంకులో వేశాను - నువ్వు జీతం నష్టం మీద సెలవు పెట్టినా బాధలేదు - నీకు నెలకి వచ్చే జీతం నేనిస్తాను - వచ్చెయ్ వెడదాం - వేసవి సెలవులకి పిల్లల్ని తీసుకురమ్మని అమ్మ చెప్పింది -" అన్నాడు రాఘవరావు -

"నేనూ సంపాదిస్తున్నాను రాఘవా - నా జీతం ఇంటద్దెకీ మా తిండి తిప్పలకీ చిన్న చిన్న సరదాలకీ పిల్లల స్కూల్ ఫీజులకీ చాలడం లేదని, నేనూ ఒక పత్రికాఫీసులో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాను - రాత్రి ఏడింటి నుంచీ ఎనిమిదింటి దాకా ప్రూఫ్‌లు దిద్దడం - మేము బాగానే వున్నాం - ఏ పనీ చెయ్యకుండా నీదగ్గర్నుంచీ జీతం తీసుకోవడం నా కిష్టం లేదు -" అన్నది రజని - రాఘవరావు ఉలిక్కిపడ్డాడు - రజనికి ఎంత ఆత్మాభి మానమో తనకి తెలుసు -

"మీరు లక్ష రూపాయిలు దాచి నందుకు సంతోషం - మీ చెల్లెలు పెళ్ళికి నగలు పెట్టి బ్యాంక్‌లో అప్పు తెచ్చాం - అవ్వి విడిపించి యిస్తే నాకు పనికొస్తాయి -" అంది -

ఆ నగల సంగతి తనకిన్నాళ్ళు ఎందుకు గుర్తు రాలేదో అర్థం కాలేదు రాఘవరావుకి. తల్లిగానీ తండ్రిగానీ ఆ మాటే గుర్తు చెయ్యలేదు -

"నాతో రానంటావయితే - సుబ్బా రావుని చూడకుండా వుండలేనంటావు?" అన్నాడు - ఆ మాట అన్నాక అతనికి ఊపిరాడింది - కిటికీ దగ్గర నిలబడి సిగరెట్ ముట్టించుకున్నాడు - హాయిగా నిట్టూర్పు వదిలాడు. రజనీ చాలాసేపు మౌనంగా వుండిపోయింది - ఆమె ఏడుస్తోందేమోనని వెనక్కి తిరిగాడు - మంచంమీద పడుకుని పుస్తకం చదువుతోంది - ఆ తలబిరుసు తనమే తనకి వొళ్ళు మండించేది.

"నేను రేపు వెళ్ళిపోతాను - నాకిక్కడ వుండడం నచ్చలేదు - నేనింకెప్పుడూ ఈ ఇంటికి రాను - నువ్వు మనస్సు మార్చుకుని ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నం చేసుకుని అక్కడికి వస్తే మంచిది - ఉద్యోగం మానేసినా నాకిష్టమే - నీకేలోటూ లేకుండా చూసే బాధ్యతనాది - నువ్వు కష్టపడి రెండు ఉద్యోగాలు చెయ్యక్కర్లేదు - నేనింకేం చెప్పను - మీ ఆఫీసులో జనం ఏం అనుకుంటున్నారో, ఊళ్ళో వాళ్ళేం అంటున్నారో, అంతా ఒక్కసారి వెనక్కి తిరిగి మరీ చూసుకో -" అన్నాడు.

రజని మాట్లాడలేదు - ఆమె ముఖం ఏ భావములేని తెల్ల కాగితంలా వుంది -

చెప్పినట్లే రాఘవరావు ఉదయమే వెళ్ళిపోయాడు - పిల్లలు అతని వెంట బయలుదేరితే "ఇక్కడే వుండండి" అన్నాడు -

"ఉండండి సార్, సెలవులే కదా -" అని సుబ్బారావు అంటే,

"పని వుందిసార్ ! మళ్ళీ వస్తాను"- అన్నాడు.

వారం రోజులు తరువాత రాఘవరావు మిత్రుడు సదాశివరావు అనే అతను రజనీ నగలు పట్టుకొచ్చి లిస్టు ప్రకారం జాగ్రత్తగా అప్పజెప్పాడు - దానితో పాటు ఒక్క ఉత్తరం కూడా లేదు - మరో వారం తరువాత పిల్లల పేరిట పదివేల రూపాయిలకి డ్రాఫ్టు వచ్చింది - వాళ్ళ స్కూల్ ఖర్చుల కోసం అని - దాన్ని తిప్పి పంపింది రజని - తిరిగి వచ్చిన డ్రాఫ్టు మీద ఇంట్లో తర్జన భర్జనలు జరిగాయి. రాఘవరావంత దద్దమ్మని ఇంత వరకూ తన జీవితంలో చూడలేదని తండ్రి ఆక్షేపించాడు. ఇంటిపనిలో సగం పని మనిషినీ మరొక సగం వంట మనిషినీ పెట్టి చేయిస్తున్నా తల్లి సణుగుతూనే వుంది. రజనీ కనీసం ఫోన్ కూడా చెయ్యడం మానేసింది - రజనీ , రాఘవరావూ శాశ్వతంగా విడిపోయారని ఎవరో అనగా, ఎవరో విని ఇంకెవరితోనో అంటే, వాళ్ళు "అది నిజమా! అయ్యో పాపం!" అని (రాఘవరావుని) పరామర్శించడాని కొచ్చేరు .డాబామీద పడుకుని ఆకాశంకేసి చూస్తూ గడిచిన సంఘటనలన్నీ ఒకసారి (సింహావలోకనం) చేసుకున్న రాఘవరావుకి ఏడుపొచ్చింది- వీళ్ళంతా కలిసి తన మనస్సుని ఓ పనికిరాని పాతసామాన్ల కొట్టులా చేసి కిటికీలు మూసేశారు - ఆ చీకట్లో పడి కొట్టుకుంటూ అందులోకి రజనీని కూడా లాగడానికి ప్రయత్నిస్తున్నాడు తను- ఆమెని ఘోరంగా అవమానించి వచ్చాడు. తననింక క్షమించదు - ఇప్పుడే మొహం పెట్టుకుని వెడతాడు అక్కడికి? రజనీ ఏమిటో తనకి తెలియదా ? ఎంత పిచ్చిగా మాట్లాడి వచ్చాడు ! సత్యన్నారా యణ అక్కడేం చేస్తున్నాడో, ఎవరితో తిరుగు తున్నాడో ఒక్కరోజు కూడా సునంద ఆలోచించదు - సునందే కాదు, ఊరివాళ్ళు కూడా అతన్ని ఏమీ అనరు. అతను ఏ అమ్మాయిని స్కూటర్ మీద ఎక్కించు కున్నా "ఈ రోజుల్లో అవ్వన్నీ పట్టించు కోకూడదు. ఈ స్పీడు యుగంలో అదేం తప్పు?" అని సమర్థిస్తారు. రజని విషయాన్ని తన తండ్రి, ఊరిజనం ఇంత పట్టించు కోడానికి కారణం ఏమిటి?

రజనీ లాంటి అమ్మాయిల్ని చూస్తే వాళ్ళకి భయం. అటువంటి వాళ్ళ నెత్తిన మొట్టి అణిచివుంచకపోతే అందరూ అలాగే తయారైపోతారని భయం.

రజనీ లాంటి 'పొగరుబోతు'ను చేసుకోవద్దని తండ్రి ముందే హెచ్చరించాడు. అది పొగరుబోతుతనం కాదనీ ఆత్మగౌరవం అనీ వ్యక్తిత్వం అనీ మెచ్చేసుకుని అలాంటి అమ్మాయితో బ్రతకడంలోనే ఆనందం వుందని తీర్మానించుకున్నాడు. కానీ పెళ్ళికాగానే తను సగటు భర్తలా మారిపోతున్నాడు. రజనీ సహచర్యంలో తనేం నేర్చుకోలేక పోయాడు. రాఘవరావు ఒక్క

ఉదటున లేచి, సూట్‌కేసులో నాలుగు జతల బట్టలు కుక్కుకుని, "నేను హైదరాబాద్ వెడుతున్నాను" అని తల్లికి చెప్పాడు.

"ఈ సారి తాడో పేడో తేల్చుకొచ్చెయ్" అన్నాడు తండ్రి. రాఘవరావు సమాధానం చెప్పకుండా పరిగెత్తుకువెళ్ళి చివరి బస్సు అందుకున్నాడు. ఉషోదయానికి రజని ముందు వాలాలి.

కదిలేబస్సు కిటికీ దగ్గర కూర్చుంటే కమ్మనిగాలి చెంపల్ని తాకింది. రజని తనని తప్పకుండా క్షమిస్తుంది. "నువ్వు వస్తావని నాకు తెలుసు రాఘవా-" అని తనని దగ్గరకు తీసుకొని తన నుదుటిమీద ముద్దు పెట్టినట్లు కలకూడా వచ్చింది.

*(ఆహ్వానం మాసపత్రిక, ఏప్రిల్ 1995)*